



తూర్పు తెల్లవారకముందే లేచి పిల్లలకూ — భర్తకూ తలఅంటిపోసి — తానూ తలఅంటుకొని స్నానం చేసింది సునేత్ర. — అందరి స్నానాలూ ముగిసేప్పటికి చీకటి ఏలుబడి సైతం ముగిసిపోయి — తూర్పుదిశను అరుణరేఖలు ఆవిర్భవించి — నూతన అందాన్ని ప్రస్ఫుటింప జేస్తూ — చూపరుల హృదయాలలో వినూత్నోత్సాహాన్ని రేకెత్తించినవి.

దీపావళీ పండగ హడావడిలో మునిగి తేలుతూన్న సునేత్రకు పెరటిలోని బాదం చెట్టుమీది కాకి అరుపులు కొంత అడ్డమై — ఆలోచనకు తావివ్వసాగినై. పనిచేసుకుంటూన్నా — మనస్సులో మాత్రం — 'ఎవరు వస్తారో'? అనే ప్రశ్నమాత్రం మెదులుతూనే వుంది. — అఱచి అఱచి ఆ కాకి గొంతు నొవ్వడంచేతనో ఏమో — ఆ చెట్టువిడచి తూర్పుదిక్కుగా ఎగిరేపోయింది.

నాటి పగలంతా ప్రశాంతంగా గడచిపోయింది. కలిగినంతలో పిండివంటలతో కడుపులు నింపుకొని పండగ ఆనందాన్ని అనుభవించారు, ఆకుటుంబస్థులు. — సంధ్యపడ్డమే తడవుగా యింటినంతా ప్రమిదెలతో అలంకరించి — జ్యోతులతో వెల్గొందింప జేసే ప్రయత్నంతో మునిగివుంది సునేత్ర...

"అమ్మా! అమ్మా!! చుట్టాలు వచ్చారే! గుఱ్ఱంబండి మన యింటిముందు ఆగింది. — రావే అమ్మా! చూద్దూగానీ రా అంటూ — పెద్ద బిడ్డ సుమిత్ర తల్లిచేయి బట్టుకొని వీధిగుమ్మంలోకి లాక్కుంటూ పోసాగింది. చుట్టాలు వచ్చారని వినడమే సునేత్రకు ఆశ్చర్యమూ — విస్మయమూ కలిగినై! బిడ్డ చేయిబట్టు లాక్కుంటూ పోతూవుండగానే సునేత్ర లోలోన పరిపరివిధాల భావనలలో చిక్కి నడక సాగించింది.

ఆమె అత్తవారింట కాపురానికి రాకముందుగానే వున్నతల్లీ — సోదరులలో తల్లిని గోల్పోయింది. మిగిలిన ఒక్కగానొక్క సోదరునీ తను అత్తవారింటిని జేరడంతోనే తిరిగి కన్నులనైనా చూచి ఎరుగదు. యిలా సోదరీ సోదరుల మధ్య యింతటి ఎడబాటు గలుగడానికి కారణం? అది ద్వేషపూరితమైన సన్నివేశాలవల్ల ఏర్పడిందా? కాదు. కాదు. పోని సోదరిపై ఆ సోదరునికి అనురాగమూ — ఆదరణ లేక నందుమా? అది అంతకుమున్నే కాదు. చెల్లెను క్షణం చూడకుండా వుండలేని చక్రధరుడు నాలుగేండ్లు ఎలా గడపగలడు? — మరి ఏం కారణమంటూరు కదూ మీరు? — అయితే వినండి! —

సునేత్రను అత్తవారింటికి పంపిన మరుచటి నెలలోనే — దేశమంతా స్వాతంత్ర్య సమరాగ్నితో మండిపోసాగింది. — జాతీయవాదీ — ఆదర్శ దేశసేవకుడూ — అవిరళ దీక్షా పరతంత్రుడూ — అనుపమ స్వార్థత్యాగీ అయిన చక్రధరుడు వెనుక ముందులు చూడకుండా వీరునివలె సమరరంగానికి వురికాడు. పల్లెపల్లెలో విప్లవ బీజాలను వెదజల్లాడు. పగలనక — రాత్రి అనక — ఒక్కోనాడు కంటిపై కునుకునైనా రానీక — రహస్యమార్గాల వెంట — అడవులత్రోవల పయనిస్తూ — విప్లవ తూర్యనాదాలతో మైమరచి — బానిసలై పడివున్న వాళ్ళ నంద

రనూ—వుల్కిపడి లేచి — దేశమాత పిలుపును విన్నట్టు—వీరులై తుపాకీ గుండ్లకు ఎదురొమ్ములు నిచ్చి నిలచేట్టు జేశాడు. అతడు అజ్ఞాతవీరుడు. ప్రభుత్వం కన్నులలో దుమ్ముజల్లుతూ—అజ్ఞాతవాసంలో వుండిపోయాడు.—ఈ విషయాలు అప్పుడప్పుడూ జాబులద్వారా చెల్లెలకు తెలుస్తూవుండేవి. గాని మూడు నెలలకే— పెనుముప్పు చేకూరింది యీ జాబులవల్ల. అది ఎలానో గ్రహించుకొని తప్పించుకొని పోయాడు చక్రధరుడు. ఆనాటినుంచి జాబులకు సైతం నోచుకోలేదు సునేత్ర.—యిలా నాలుగేండ్లు గడచిపోవడంవల్ల యిక తన అన్నను తాను చూడలేననే అనుకొని—గుండెను దిటవుచేసుకొని ఎలానో సంసారయాత్ర సాగిస్తూంది ఆమె.—

ఇంతవరకూ మగనితరఫున ఏచుట్టమూ తమ యింటికి రాకపోవడం వల్లా—ప్రొద్దుట కాకి అదే పనిగా గోలబెట్టి పోవడంవల్లా—ఒకవేళ తన అన్నగారే వచ్చివుండవచ్చునేమో అనే ఆశారేఖ అస్ఫుటంగా హృదయమధ్యన పొడసూపుతూవుండగానే కండ్లు రెండూనిండుగా నీళ్లను నింపుకున్నాయ్. హృదయం దడదడలాడింది. పెదవులు అదరినై!—అడుగులు తడబడుతూ వుండగానే—సుమిత్రతో వీధివాకిలి జేరింది సునేత్ర!—

"సునూ! చెల్లీ!—సునూ!!"

నీళ్లునిండిన కన్నులనుండి చూడ్డంవల్ల ఎదుట నిలచిన వ్యక్తిరూపం మసకమసకగా కనుపించింది.


మా ఖాతాదారులందరికీ శుభవార్త!

రంగూనునుంచి అసలు రంగూను వీలుమార్కు చెన్నీస్ వజ్రాలు వచ్చియున్నవి.

ఒరిజినల్

రిజిస్టర్డ్ వీల్ మార్కు వజ్రాలు రిజిస్టర్డ్

ప్రసిద్ధమైన

చెన్నీస్ 

వజ్రాలు

అన్ని పట్టణాలలోనూ షరాబువ్యాపారులవద్ద దొరకును

చెన్ని రాధాకృష్ణ & కో., పెద్దబజారు, తిరుచునాపల్లి

మీకు కావలసినవాటికి : చెన్ని రాధాకృష్ణ అండ్ కో.,

పెద్ద బజారు :: తిరుచినాపల్లి.

పుప్పొంగి పోతూన్న హృదయానందంతో కనులనీళ్లు వెలికిరాల్చి— పరవశత్వంతో — "అన్నయ్యా!" అంటూనే కౌగిలించుకొని పసిదానిలా ఏడ్చింది సునేత్ర.

సోదరి తలనిమురుతూ—ఓదారుస్తూ—కన్నుల నీళ్లు నింపుకున్నాడు చక్రధరుడు. యిన్ని ఏండ్లకు తిరిగి తనచెల్లెలను చూడగలిగినందువల్ల కొంత శాంతిని పొందింది అతని హృదయం.—సునేత్ర అతని చేయిపట్టుకొని గదిలోనికి లాక్కొనిపోతూ—జాలిగా—నిష్ఠురంగా—గౌరవంగా అనేక భావాలతో మాట్లాడుతూ — తుదకు పసిదానిలాగా గారాన్ని గనబరచింది. అన్నయ్యముందు.—

అన్నగారిని ప్రశ్నలతో ముంచివేస్తూ—అతని చరిత్రను వింటూ కాలాన్నే మరచిపోయింది. అదిగు ర్తించిన చక్రధరుడు ఆమెను హెచ్చరించాడు. ఆ హెచ్చరికతో తనల్లో తానే సిగ్గుపడిపోయి—లేడిలా ఛెంగునలేచి పురువుపెట్టింది బైటకు. ఆ చీకటిలో అలానే కూర్చుండి తన్మయత్వంతో కన్నులు మూసుకున్నాడు చక్రధరుడు.

౨

ప్రమిదెల నిండుగా నూనె నింపి—వత్తులను అందులోవుంచి—వరుసగా పేర్చి జ్యోతుల వెల్గించి పులికిత హృదయినియై—మగనినీ—అన్ననూ చూస్తూ నిలచింది సునేత్ర. సుమిత్ర తల్లిపైటచెఱగు పట్టుకుని లాగింది. రెండవ బిడ్డ మామ ఒడిలో కిలకిల నవ్వుతూ బోసినోట జ్యోతులవైపు చేతులు చూపుతూన్నాడు. చక్రధరుడు బిడ్డను ముద్దాడి—తండ్రి ఒడికి వానిని అందిచ్చాడు. మెల్లమెల్లగా ఆ ప్రమిదెల నన్నింటినీ ఒక్కొకటిగా చావడిమధ్యలో పేరుస్తూవుంటే ఆశ్చర్యంతో చూస్తూ నిలిచారు ఆ దంపతులు.

ప్రమిదెల నన్నింటినీ పేర్చడం పూర్తి అవడమే భక్తిపూర్వకంగా చేతులు జోడించి ముకుళిత నయను డయ్యాడు చక్రధరుడు. సునేత్ర తన పతి సమేతయై వందన మాచరించింది—ఆ హిందూదేశ స్వరూపాన్ని ఛాయగా చూపట్టజేసే జ్యోతుల సమూహానికి.

చక్రధరుడు ఓపెట్టెను లోననుండి గొనివచ్చి—చెల్లెలి చేతికిస్తూ—'సునూ! యీ నీఅన్నయ్య యిచ్చే దీపావళీ కానుకయిదిగో! తీసికో చెల్లీ! నగ నాణ్యాలకన్న—అన్ని బహూకరణలకన్న—అమూల్యమై—అత్యంత మహిమాసమన్వితమై—నలుబది కోట్ల బానిస భారతీయుల బంధనాలను సమూలంగా నాశన మొనర్చగల అపారశక్తిగల యీ రాట్నాన్ని కొని నీ అన్నయ్య హృదయానికి సంతృప్తి గలిగించు.—' అన్నాడు

ప్రేమతో—కృతజ్ఞతతో దానిని గ్రహించి అన్నపాదాలవద్ద కూలబడి—నమస్కరిస్తూ సునేత్ర యిలా అన్నది: "అన్నయ్యా! నీ చెల్లెలినైనందుకు—నేనూ నీలానే దేశానికి చేతనైనంత సేవ చేయడం నాకర్తవ్యం. యింతవరకూ నీయాజ్ఞ లేకపోవడంవల్ల యిలా కర్తవ్యశూన్యనై నిలిచాను. నేను నీ ఆశీర్వాద బలంతో దీక్షను గొంటున్నాను. అన్నకు తగ్గ చెల్లెలు అనిపించుకో గలను."

ఆనదంతో ఆమెను ఆశీర్వదించాడు చక్రధరుడు. అందరూ సంతోషంతో పసిపిల్లల వెంట నిడుకొని లోనకుపోయారు. మెల్లమెల్లగా, దీపమాలతో ఏర్పడ్డ హిందూదేశం నిశ్చలమై వెల్గొందింది.

కథాంజలి
అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-3-0